క్లుప్తంగా

నాణ్యతగా రోడ్డు నిర్మించాలి



పాన్‌గల్: మండలంలోని ఏదుట్ల వయా రేమద్దుల మీదుగా సింగోటం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులను వేగంగా.. నాణ్యతగా పూర్తి చేయాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం మండల బీజేపీ నాయకులు, రేమద్దుల నాయకులతో కలిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ రోడ్డు పనులు జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేస్తే ప్రజల ఇబ్బందులు తొలుగుతాయన్నారు. రోడ్డు నిర్మాణం పనుల విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు.

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కోసం పట్టణ కేంద్రానికి చెందిన ఎల్లంపల్లి లక్ష్మమ్మ లక్ష్మారెడ్డి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్లంపల్లి రంగారెడ్డి, లలితమ్మ దంపతులు తమవంతు సమాయంగా రూ.25,116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈనెల 13 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో తిమ్మన్నయాదవ్, సత్యంయాదవ్, బాల కొండయ్యయాదవ్, పెంటన్నయాదవ్, అద్వానీ శ్రీను, హన్మంత్‌యాదవ్, శివన్నయాదవ్, యాదయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి



ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీని అవమానపరుస్తూ.. ఆయన దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం పాటుపడుతున్న ప్రధానమంత్రి దిష్టిబొమ్మను తగలబెట్టడం నీచమైన చర్యగా అభివర్ణిస్తూ ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, నాయకులు రాజశేఖర్, అశోక్‌నంద, రవి, శివ, నవీన్, రాజు, అజయ్ తదితరులు ఉన్నారు.

జములేశ్వరిదేవి పట్టువస్త్రాల ఊరేగింపు



అమరచింత: పట్టణంలోని జములేశ్వరిదేవి ఉత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారి పట్టువస్త్రాలతో పాటు అభరణాలను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలించారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే జములమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి సుందరీకరించి అమ్మవారి విగ్రహాన్ని పట్టువస్త్రాలు, నగలతో అలంకరించారు. ప్రతి సంవత్సరం అమ్మవారి ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వస్తున్న భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ పరిసరాల్లో వసతులు కల్పించారు.

డ్రమ్‌సీడర్‌పై అవగాహన

కొల్లాపూర్: మండలంలోని అంకిరావుపల్లిలో సోమవారం ఏఓ చిన్న హుస్సేన్ యాదవ్ రైతులతో సమావేశం అయ్యారు. వరినాటులో డ్రమ్ సీడర్ విధానం గూర్చి అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్‌లో వరినాటే విధానాన్ని చూపించారు. ప్రయోజనాలను, వరిసాగులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాల సేకరణ అంశాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సూర్యతేజ, మోనిక, శిరీష తదితరులు ఉన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



అమరచింత శిశుమందిరంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఆత్మకూర్: వసంత పంచమి పూజలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలోని సరస్వతిదేవి అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చరణలతో అభిషేకం, కుంకుమార్చన, మంగళహారతి, చిన్నారులకు అక్షరాభ్యాసం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శృతిజ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పలుకలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ, అరుణదేవి, గాడి చైతన్య, భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో మంగళవారం హోమం నిర్వహించారు. సరస్వతిదేవీ చిత్రపటానికి పూజలు నిర్వహించి పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈమేరకు ప్రధాన ఆచార్యులు లక్ష్మి మాట్లాడుతూ వసంత పంచమి రోజు చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తే వారు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. శిశుమందిరాల్లో క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వనపర్తి : మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వరగుప్తా మాట్లాడుతూ సంగీత సాహిత్యాది విద్యలకు అధి దేవత సరస్వతి అని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, రవి, రుద్రమదేవి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాలలో..



ఆత్మకూర్‌లో చిన్నారులకు పలుకలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సైన్స్ లేనిదే అభివృద్ధి లేదు

వనపర్తి: సైన్స్ లేనిదే అభివృద్ధి లేదని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాబ్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని దేశ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్కూల్ యజమాన్యం చిన్నారెడ్డి శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముదిన్, కాంగ్రెస్ నాయకులు బాబా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ జి.చిన్నారెడ్డి

జై జవాన్.. జై కిసాన్ నినాదంతో పాదయాత్ర



ప్రదీప్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సభ్యులు

కొత్తకోట రూరల్: జై జవాన్.. జై కిసాన్ నినాదంతో జనవరి 26 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లా కేంద్రం నుంచి పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం వరకు ప్రదీప్‌కుమార్ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో భాగంగా సోమవారం కొత్తకోటకు చేరుకున్నాడు. స్థానిక ఛత్రపతి వాకింగ్ గ్రూప్ సభ్యులతో పాటు హిందూవాహిని సభ్యులు యువకుడికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ గతంలో 2024 జూన్ 15లో ఆల్ ఇండియా సైకిల్ యాత్ర చేపట్టానని, కాస్త విరామం తర్వాత జనవరి 26 నుంచి పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఎటువంటి స్వార్థం లేకుండా దేశం కోసం బతుకుతున్న వారిలో జవాన్, రైతు మాత్రమేనని ఉన్నారని, అందుకే వారిని కాపాడుకునేందుకు జనంలో మార్పు తీసుకొచ్చేందుకు ఈ పాదయాత్రను 90రోజుల పాటు కొనసాగిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఛత్రపతి వాకింగ్ గ్రూప్ అధ్యక్షుడు స్టార్ ఆంజనేయులు, చీర్ల యాదయ్యసాగర్, వెంకట్రాములు, ఎల్‌ఐసీ రవి, లాల్‌కోట రవి, రాంచంద్రారెడ్డి, రాజుయాదవ్, రవీందర్‌గౌడ్, జాజల శ్రీను, నాగరాజుయాదవ్, వేణు, నగేష్‌యాదవ్, ఆంజి, రవి, శివయాదవ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్



ఎస్‌ఐకి నగదును అందజేస్తున్న గ్రామస్తులు

అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని సింగంపేటలో సోమవారం సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వందమంది పోలీసులు చేసే పని ఒక్క సీసీ కెమెరాతో సాధ్యమవుతుందన్న విషయాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో గ్రామస్థులు తమ గ్రామంలో సీసీ కెమరాల కోసం స్వచ్ఛందంగా చందాల రూపంలో డబ్బులను పోగుచేసి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్తులు ముందుకు వచ్చారని ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మకూర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని తిప్పుడంపల్లిలో సీసీ కెమరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, సొంతంగా డబ్బులను సమకూర్చుకొని సీసీకెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.30 వేలు సమకూర్చి సీఐ, ఎస్‌ఐ కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాతె బుచ్చన్న, ఏఎస్‌ఐ రోషయ్య, సిబ్బంది బాల్‌రాజు, రమేష్, ఇమామ్, గ్రామస్తులు హరినాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, అశోక్‌సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి



పాన్‌గల్‌లో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్



వీపనగండ్లలో..

పాన్‌గల్: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న మధుమేహ (షుగర్) నిర్ధారణ పరీక్షలను 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చేయించుకుంటూ వైద్య సిబ్బందికి సహకరించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య మండల ప్రజలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు కేతేపల్లి గ్రామాల్లో మధుమేహ నిర్ధారణ పరీక్షలను ఆయన పరిశీలించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 875 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

పెబ్బేరు మండలంలో..

కొత్తకోట (పెబ్బేరు రూరల్): కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో సోమవారం 30 ఏళ్లు పైబడిన వారందరికీ మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ అశోక్‌రెడ్డి, మేనేజర్ గణేష్‌బాబు, సూపర్‌వైజర్లు పార్వతమ్మ, లీలమ్మ, స్వరూప, అసిస్టెంట్లు రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వనపర్తి (వీపనగండ్ల): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో చేపట్టిన మధుమేహ పరీక్షల తీరును పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేసినట్లు మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహిస్తామని, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని బండపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొమారి వెంకటపతినాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, వెంకటేష్ నాయుడు, రవికుమార్, మధుసూదన్‌రెడ్డి, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



కొత్తకోట రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు కొత్తకోట ఎంపీడీఓ చెన్నమ్మ ఆదేశించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం సోమవారం ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ సుదర్శన్ మండలంలోని పాలెం, నిర్వేన్, రామనంతాపూర్, ఈదులబాయితండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ తాగునీటిని వృథా చేయకుండా సరైన పద్ధతిలో వాడుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం ఇబ్బంది అయితే గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా ఉన్న బోర్లను సరిచేయాలని, పైప్‌లైన్లు లీకేజీ అయితే వెంటనే మరమ్మతు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మొగులయ్య, పంచాయతీ కార్యదర్శులు నరేష్, పవిత్ర, శిరీష, రాంచరణ్ ఉన్నారు.

వనపర్తి (ఖిల్లాఘనపురం): మండలంలోని ఆగారంలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీఓ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి పరేశ్ తెలిపారు. సోమవారం ఆగారంలో గ్రామస్తులు మున్నూరు జయకర్, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్ తదితరులతో కలిసి గ్రామంలోని వాటర్ ట్యాంకులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ మరమ్మతుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీటి వృథా అరికట్టేది ఎలా?



అమరచింత: పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి ప్రతిరోజు తాగునీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు దీనిని అరికట్టలేని స్థితిలో ఉన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నా.. స్థానిక అధికారులు మాత్రం రహదారులపై తాగునీరు వృథాగా పారుతున్నా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అమరచింత పట్టణంలోని దశమికట్ట సమీపంలోని మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు హైస్కూల్ ఆవరణలో ఉన్న ట్యాంకులు నీటితో నిండుకుని ఓవర్‌ఫ్లో ద్వారా తాగునీరు రహదారులపైపై పారుతుంది. రహదారులపై నీరు ప్రతిరోజు పారుతుండటంతో బీటీ దెబ్బతిని గుంతలమయంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి



కొత్తకోట రూరల్: ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అప్పరాలలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను గ్రామస్తులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, సిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితర ఉన్నారు.

కరాటేలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన కొత్తకోట విద్యార్థులు

కొత్తకోట (పెబ్బేరు రూరల్): జిల్లా కేంద్రంలో జరిగిన కరాటే టోర్నమెంట్‌లో పెబ్బేరు మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఈ కరాటే పోటీలను నిర్వహించగా.. మోడల్ పాఠశాలకు చెందిన హర్షవర్ధిని, గీతశ్రీ, గాయత్రి, జాహ్నవి, తేజశ్రీ అద్భుత ప్రదర్శన కనబరిచి బంగారు పథకం సాధించారని మాస్టర్ జి.కుమారస్వామినాయుడు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాజవర్ధన్‌రెడ్డి, కవి, నారాయణ విజేతలకు మెడల్స్ అందజేశారు. అదేవిధంగా పెబ్బేరు మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన ఇఖ్రాభాను, ఇశ్రాత్ ఫాతిమా, సాధియాభాను, చోటి సాదియలు కరాటేలో గోల్డ్ మెడల్, ఈస్టిరాణి సిల్వర్ మెడల్ సాధించినట్లు మాస్టర్ ఆఫన్ తెలిపారు. కార్యక్రమంలో నబీ, పరమేష్, రాము, బాబు, అంజి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చాటిన ఏఆర్ కానిస్టేబుళ్లు

కొత్తకోట: ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన 3వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ 2025, 38 ఈవెంట్స్ త్రైకాండో కరాటే పోటీల్లో కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు ప్రతిభ కనబరిచారు. త్రైకాండో అండర్ 58 కేటగిరిలో కనిమెట్టకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరి గోల్డ్ మెడల్ సాధించగా, అండర్ 68 కేటగిరి విభాగంలో కొత్తకోటకు చెందిన జి.కురుమూర్తి సిల్వర్ మెడల్‌ను సాధించారు. వీరిని ఎస్‌ఐ ఆనంద్, కరాటే మాస్టర్లు పరశురాములు, శివశంకర్, రవి, పెంటన్న, నరేందర్‌సాగర్, సంతోష్, నరేష్‌నాయుడు, రమేష్‌రెడ్డి, మాధవ్‌నాయుడు, శివయ్య అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలో..

జడ్చర్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 24వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తకోట పట్టణానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోకాన్ కరాటే డు ఇండియా కరాటే విభాగానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. కటాస్ విభాగంలో యోగేశ్వరి, లౌలిక్‌రెడ్డి, మహిత్, యోగేశ్వర్‌రెడ్డి, పవన్, భరత్, రోకాయా, రిషిత, తపస్సు బంగారు పథకాలు సాధించారు. కుమ్మితే విభాగంలో అభిజిత్, గౌతమ్, ఆదిత్‌రెడ్డి, కేత్రిక, అన్విత, ఏకాంబరీ, లక్ష్మీకాంత్‌రెడ్డి, బృందా, బన్నీ, సిద్ధు, వైభవ్ బంగారు

‘బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం’



ఆత్మకూర్‌లో మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక గాంధీ చౌక్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఢిల్లీ పెద్దల ముందు మోకరిల్లి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నారని, వారికి ఆత్మగౌరవం ఉంటే పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కోట్లు పన్నులు చెల్లిస్తున్న రాష్ట్రానికి నిధులు కేటాయింపులో మొండిచేయి చూపించడమేమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, సాయిరాఘవ, బుచ్చన్న, అంజి, వెంకటన్న, గణేష్ ఉన్నారు.

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, సింగల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు అన్నారు. రాష్ట్రానికి నిధులు తక్కువగా కేటాయించడంపై సోమవారం కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వాస నాగేశ్వర్, డాక్టర్ నరేందర్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, మల్లేష్, రవి నాయక్, అజీమ్, నవీన్, బుచ్చిరెడ్డి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



రేమద్దులలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్‌కు ప్రయోజనాలు కాపాడేలా, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు నష్టం జరిగేలా ఉందని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బాల్యానాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ మాట్లాడుతూ.. దేశంలోని 140 కోట్ల మంది జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగలేదని, ప్రాధాన్యత రంగాలకు బడ్జెట్ పెంచలేదని, బడా కార్పొరేట్ శక్తులకు మేలు జరిగేలా బడ్జెట్ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, కమలాకర్, భాస్కర్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

‘మాదిగల గుండెచప్పుడు ప్రపంచానికి వినిపిద్దాం’



మాట్లాడుతున్న గద్వాల కృష్ణ

వనపర్తి: మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటించేందుకు ఈ నెల 7న హైదరాబాద్‌లో లక్ష డప్పుల వెయ్యి గొంతుల సభను ప్రతి ఉద్యోగి విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంఈఎఫ్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల కృష్ణ మాట్లాడుతూ ఒక కులం ఎస్సీ వర్గీకరణను నేటికీ అడ్డుకోవడం వలనే జాప్యం జరుగుతుందన్నారు. వేల గొంతుల నుంచి వచ్చే మన పాటలు, లక్షల డప్పుల మాదిగల గుండె చప్పులను హైదరాబాదే కాదు ప్రపంచానికి వినబడేలా గర్జిద్దామన్నారు. డప్పులు మాదిగ జాతి బిడ్డల భవిష్యత్ కోసం మోగాలని, అందుకు సిద్ధమై అందరూ రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివన్‌కుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సువార్తమ్మ, జిల్లా సమన్వయకర్త గంధం గట్టయ్య, తగవుల వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు బచ్చలకూర పరమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు గంధం భగవంతు, జొల్లు గంగన్న, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పీఠాధిపతి పూజలు



పీఠాధిపతికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థ శ్రీపాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులను ఉద్దేశించి స్వామి వారు మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలన్నారు. చెడు వ్యసనాలు వీడి ఆధ్యాత్మికత చింతనను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం స్వామి వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, దీరేంద్రదాసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.